క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు నాయకులు పాటుపడాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలకు సంబంధించి పశ్చిమ నియోజకవర్గానికి నియమితులైన అధ్యక్షులందరూ పార్టీ పటిష్టతకు పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల నూతనంగా నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వెలంపల్లిని సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ పార్టీని ఆయా విభాగాల్లో మరింతగా పట్టు సాధించే దిశగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. అలాగే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు, ఉద్యమించేందుకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధ్యక్షులతో పాటు నాయకులు వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశ్రమల్లో బాయిలర్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

విజయవాడ బాయిలర్ల తనిఖీ అధికారి జె.శ్రీనివాసరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరిశ్రమల్లో ఏర్పాటు చేసే బాయిలర్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలని బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి జె.శ్రీనివాసరావు ఆదేశించారు. గాంధీనగర్‌లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ హాలులో బాయిలర్ ఆపరేటర్లకు పునఃశ్చరణ తరగతులు సోమవారం జరిగాయి. బాయిలర్ల నిర్వహణ విధానాలు, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన బాయిలర్ ఆపరేటర్లకు అవగాహన తరగతులు నిర్వహించారు. బాయిలర్లలో నీటి వినియోగం, శుద్ధి మొదలైన అంశాలపై సుదీర్ఘ అనుభవం గల వారితో శిక్షణ ఇప్పించారు. ఏటా ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి ఎం.సత్యనారాయణతో పాటు వివిధ ఫ్యాక్టరీల ప్రతినిధులు షేక్ రిషావత్ ఆలీ, వి.వి.వి.సత్యనారాయణ, ఎస్.నందకేశవరావు, కె.ఎస్.పవన్ నారాయణ, ఎం.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

రేపు సాయిబాబా మందిరంలో శివరాత్రి మహోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని శ్రీదాసాంజనేయ సహిత షిర్డీ సాయిబాబా, ఉమా రామలింగేశ్వర స్వామివార్ల మందిరంలో మహా శివరాత్రి మహోత్సవం నిర్వహించనున్నట్లు మందిర అర్చకుడు గురుజాడ బాల చంద్రశేఖర శర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సామూహిక ఏకవార రుద్రాభిషేకాలు, 11.30 గంటలకు స్వామి వారికి అన్నాభిషేకం, 12 గంటలకు విశేష పుష్పాలంకరణ, అర్చన, తీర్థ ప్రసాద గోష్టి జరుగుతాయన్నారు. సాయంత్రం 6.30 గంటలకు దీపోత్సవం, నక్షత్ర హారతులు, రాత్రి 11 గంటలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబరు 8ని రద్దు చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆటో కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. నగరంలోని పలు ఆటో స్టాండ్‌లలో ఈ జీఓకు వ్యతిరేకంగా కార్మికులకు నిరసన తెలిపారు. ఈ జీఓకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆటో కార్మికుల కడుపుకొట్టే జీఓను రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇది అమలు జరిగితే కార్మికులు జీవన భద్రత కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే జీఓను రద్దు చేయాలని, ఐదు మండలాలతో పాటు నగర పరిసర మండలాల ఆటోలను విజయవాడకు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అవకాశం కల్పిస్తూ కొత్త జీఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో బస్టాండ్, షిర్డీ స్టాండ్, గొల్లపూడి ఎట్కిన్‌సన్ సెంటర్, గంగూరు సెంటర్, నలంద స్కూల్, సిద్ధార్థ స్కూల్, బెంజ్ సర్కిల్, ఎట్కిన్‌సన్ స్కూల్ ఆటోస్టాండ్, గాంధీనగర్ ఆటో స్టాండ్‌లలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసన కార్యక్రమాల్లో ఇఫ్టూ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆది దంపతుల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

- మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు
- పుణ్యస్నానాలకు సిద్ధమైన స్నానఘాట్లు
- ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



పుణ్యస్నానాలకు సిద్ధమైన దుర్గాఘాట్



భీమన వారి పేటలోని అర్ధనారీశ్వర స్వామి



చిట్టినగర్‌లోని ఆది దంపతులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆది దంపతుల కల్యాణోత్సవానికి కృష్ణానది తీరంలోని స్నాన ఘాట్లు, చిట్టినగర్‌లోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. 26వ తేదీ బుధవారం తెల్లవారుజాము నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి పుణ్యస్నానాల కోసం కృష్ణానది తీరంలోని స్నాన ఘాట్లు సిద్ధమయ్యాయి. దుర్గాఘాట్‌తో పాటు పున్నమి, భవానీ ఘాట్లలో భక్తులు విశేషంగా పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో ఆయా స్నానఘాట్లను శుభ్రం చేయడంతో పాటు భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వసతులను కల్పిస్తున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున దుర్గాఘాట్‌కు తరలిరానున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఇక ఆలయాల్లో స్వామివారి పంచామృత అభిషేకాలు, త్రికాల అభిషేకాలు, రాత్రి లింగోద్భవ సమయంలో అభిషేకాలు, కల్యాణోత్సవానికి ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో విశేష అభిషేకాలు, రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. స్వామివారి అభిషేకాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇక ఆలయ ప్రాంగణంలోని ఆది దంపతుల కల్యాణోత్సవానికి ప్రత్యేక వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఉభయ దాతలు, భక్తుల సమక్షంలో ఆది దంపతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు కాశీ విశ్వనాథ శాస్త్రి పేర్కొన్నారు.

కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో..

వాగు సెంటర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామి వారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో వై.సీతారామయ్య పేర్కొన్నారు.

నాలుగు రోజుల పాటు ఉత్సవాలు

భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవాలను నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పేర్కొన్నారు. 25వ తేదీ స్వామి వారు, అమ్మవార్లను మంగళ స్నానాలు, పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరణ జరుగుతుంది. 26వ తేదీ తెల్లవారుజాము 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, రాత్రి 12 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గంగా పార్వతి సమేత విజయదుర్గా రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. 27వ తేదీ పవళింపు సేవ, 28వ తేదీ అమావాస్యన చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

హనుమత్ దీక్షా పీఠంలో..

పాలప్రాజెక్టు ఎదురుగా ఉన్న శ్రీహనుమత్ దీక్షాపీఠంలో మహా శివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. పీఠం ఆవరణలోని శ్రీ గౌరీ నాగలింగేశ్వర స్వామివారికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించేందుకు పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీ ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి అభిషేకాలకు తరలివచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కేబీఎన్ విద్యార్థి ప్రతిభ



యశ్వంత్‌సాయిని సత్కరిస్తున్న కమిటీ యజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉంటే విజయం సాధించడం చాలా తేలిక అని ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు తొమండ్రు శేషయ్య అన్నారు. కేబీఎన్ జూనియర్ కళాశాల విద్యార్థి బి.యశ్వంత్ సాయి 99.95 శాతంతో ఆల్ ఇండియా 13వ ర్యాంకు సాధించిన సందర్భంగా సోమవారం సాయంత్రం ఆ కళాశాలలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషయ్య యశ్వంత్‌సాయిని అభినందించి సత్కరించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, టీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పేద కుటుంబం నుంచి వచ్చిన యశ్వంత్‌కు తమ కళాశాల కమిటీ అన్నివిధాలుగా సహకారం అందించి, జేఈఈ కోర్సులో శిక్షణ ఇచ్చిందన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యశ్వంత్ జాతీయస్థాయి ర్యాంకు సాధించడం తమ కళాశాలకు గర్వకారణంగా నిలిచిందని చెప్పారు. కేబీఎన్ షైన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేంద్ర మాట్లాడుతూ ఇంటర్ మొదటి ఏడాది నుంచి తమ కళాశాలలో జేఈఈ మీద ప్రత్యేక దృష్టి కేటాయించి, అధునాతన పద్ధతుల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్, ఏవో డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల కమిటీ కోశాధికారి ఎంవీకే హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



స్నానఘాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కృష్ణానది స్నాన ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కృష్ణవేణి ఘాట్, దుర్గా ఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శివరాత్రి పండుగ సందర్భంగా వచ్చే భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా వీఎంసీ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించాలని, ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘాట్లలో శాశ్వత చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని, నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. భవానీపురంలోని మునిసిపల్ మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. పున్నమి ఘాట్‌లో గ్రీనరీ పెంచి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా చర్యలు తీసుకోవాలని, విజయవాడ నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఆహ్లాదపరిచే విధంగా పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రాజెక్టులు తెచ్చేలా అధికారులను చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ)పి.వెంకట నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అసెంబ్లీ కవరేజీకి అన్ని మీడియాలకు అవకాశం ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డిమాండ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అసెంబ్లీ సమావేశాల కవరేజీకి అన్ని మీడియాలకు అవకాశం ఇవ్వాలని, ఒకరిని అక్కున చేర్చుకొని మరొకరిని పక్కకు నెట్టడం మీడియాను అవమానించడమే అవుతుందని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు టీడీపీ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఇది యావత్తు పాత్రికేయ సమాజాన్ని అవమానించడమే అవుతుందని రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, ఉపాధ్యక్షుడు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లిఖార్జునరావు, విజయవాడ నగర అధ్యక్షుడు తాళ్ళూరి అనీల్ కుమార్, కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల కవరేజీకి కొన్ని పత్రికల, చానళ్ల, రిపోర్టర్లను అనుమతించక పోవడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ఏ రాజకీయ పార్టీల నాయకులు సభలు సమావేశాలు ఏ సమయంలో పెట్టినా సామాజిక బాధ్యతగా పరుగులు తీసి ప్రజలకు వార్తలు అందించే విలేకరులను విభజించి దూరం చేయడం సరైనది కాదని వారు ఆ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో చట్టసభలకు అత్యున్నత గౌరవం ఉందని, అదే విధంగా పత్రికా రంగానికి కూడా నాలుగో స్తంభంగా కీలకస్థానం ఉందని, శాసనసభ కవరేజీకి అన్ని పత్రికల చానళ్ల విలేఖరులకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా కొందరికి అనుమతి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం విచారకరమన్నారు. మీడియా పట్ల అలాంటి పక్షపాత ధోరణులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో అభిప్రాయ పడ్డారు. గౌరవ శాసనసభ స్పీకర్, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, మీడియా ప్రతినిధులు అందరికీ అవకాశం ఇవ్వాలని, రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మనోహరం.. పార్వతీ కల్యాణం





విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం (సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలోని కళావేదికపై సోమవారం ప్రదర్శించిన పార్వతీ కల్యాణం కూచిపూడి యక్షగాన నృత్య రూపకం నయన మనోహరంగా సాగింది. పార్వతీదేవి పరమ శివుడిని వివాహం చేసుకోవాలనే సంకల్పంతో భక్తిగా ఆయనకు సపర్యలు చేస్తుంది. ఎంతకాలమైనా శివుడు తపస్సు నుంచి బయటకురాడు. పార్వతి బాధపడుతూ ఉండటంతో మన్మధుడు శివుడిపై మన్మథ బాణం సంధిస్తాడు. శివుడు మూడో కన్ను తెరవడంతో మన్మధుడు భస్మమవుతాడు. ఆయన భార్య రతీదేవి ప్రార్థనతో శివుడు ప్రసన్నుడవుతాడు. పార్వతీదేవి తపస్సుకు మెచ్చిన శివుడు ఆమెను వివాహం చేసుకుంటాడు. ఈ వృత్తాంతాన్ని వివరిస్తూ సాగిన నృత్యరూపకం ఆద్యంతం అలరించింది. డాక్టర్ చింతారవి బాలకృష్ణ నృత్య దర్శకత్వం వహించారు. నట్టువాగం కొరివి సబ్రహ్మణ్య ప్రసాద్, గానం కుమార సూర్యనారాయణ, సుధారాణి, వయోలిన్ పాలపర్తి ఆంజనేయులు, మృదంగం హరినాథశాస్త్రి, వేణువు కుమార్ బాబు అందించారు. పరమేశ్వరుడుడిగా డి.వర్షిత వర్మ, పార్వతిగా నాగవల్లీ ప్రవల్లిక, మన్మధుడిగా నందుల సరయూ, రతీదేవిగా ఎల్.సాయినాగసుస్మిత హావభావాలతో అలరించారు. కళాపీఠం సాంస్కృతిక విభాగం కార్యదర్శి బి.వి.ఎస్. ప్రకాష్, కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎల్.లలిత్ ప్రసాద్ పాల్గొన్నారు.

తాడిగడపలో బైక్ చోరీపై కేసు

పెనమలూరు: తాడిగడపలో బైక్ చోరీ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో శ్రీనగర్‌కాలువ కట్టకు చెందిన పటమట ఆదినారాయణ ఇంటి వద్ద సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. దీంతో అతని బైక్ ఇంటికి దూరంగా పార్కింగ్ చేసి తాళం వేశాడు. అయితే అతను శనివారం ఉదయం వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. సమీపంలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బైక్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

'ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వడంలేదు'

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో నలబై శాతం ఓట్లతో ఘనమైన ప్రజామద్దతు కలిగిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇస్తే శాసనసభలో ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ ఆరోపించారు. వించిపేట, నైజాంగేటుసెంటర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రధాన ప్రతిపక్షం లేకుండా తూతూమంత్రంగా తాము నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల లొసుగులు బయట పడతాయనే దేశంలో ఎన్నడూ లేని విధంగా సాక్షితో సహా నాలుగు ఇతర మీడియా చానళ్లకు అసెంబ్లీ కవరేజీ అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీని ప్రధాన ప్రతిపక్షంగాను, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా గుర్తిస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగస్ఫూర్తిని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్టు, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఉషారాణి మాట్లాడుతూ.. నిరుపేదలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు అండగా నిలుస్తున్న డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, హెల్పింగ్ టు గెదర్ ట్రస్ట్ సేవలను అభినందించారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్, హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్‌చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీ, నవజీవన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శేఖర్‌బాబు నవజీవన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో 11 కేవీ విద్యాధరపురం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు మెయింటినెన్స్ నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బాలాజీ కాలనీ, లక్ష్మీ నగర్, మోడరన్ మ్యాక్స్ ఏరియా, లేబర్ కాలనీ, నారిండివారి వీధి, కొండ బడి ఏరియా, సొరంగం కొండ, చెరువు సెంటర్, మర్రిచెట్టు సెంటర్, చిన్న సాయిబాబా గుడి ఎదుట కొండ ప్రాంతం, పెద్ద సాయిబాబా గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

నిరంతరం పారిశుద్ధ్య పనులు

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నిరంతరం చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో వివిధ శాఖాధిపతులతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధ్యానచంద్ర మాట్లాడుతూ.. మైనర్, మీడియం, మేజర్ డ్రెయిన్లన్నింటిలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. నగరాన్ని గుంతల రహితంగా తీర్చిదిద్దాలని, నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయిన్లలో పూడిక తీత చేపట్టాలని ఆదేశించారు. నగర సౌందర్యాన్ని భంగం చేసే సర్వీస్ ప్రొవైడర్ల వైర్లను పరిశీలించి తొలగించాలని స్పష్టంచేశారు. నగర అందాన్ని మెరుగుపరిచేందుకు నమూనాగా ఒక రోడ్డును వైర్‌లు లేకుండా భూగర్భం నుంచి వెళ్లేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ, ప్రజారోగ్యం శాఖల సమన్వయంతో కమర్షియల్ టాక్స్, టౌన్ ప్లానింగ్ శాఖ సమన్వయంతో ఖాళీ స్థలాల నుంచి హౌస్ టాక్స్‌కు మారిన పనుల వివరాలు, ఇంజినీరింగ్ శాఖ సమన్వయంతో నీటి పన్ను వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని పూర్తి స్థాయిలో వసూలు చేయాలని పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, డెప్యూటీ కమిషనర్ జి.సజన, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు భావన



సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారిణి భావనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కల్పన తదితరులు

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు విజయవాడ క్రీడాకారిణి బి.భావన అర్హత సాధించింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న భావన 2018 నుంచి 2024 వరకు పంజాబ్, మధ్యప్రదేశ్, విజయవాడ, భువనేశ్వర్, అహ్మదాబాద్, లక్నోలో జరిగిన పది జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొని సత్తా చాటింది. భారత అమేచ్యూర్ సాఫ్ట్ టెన్నిస్ సమాఖ్య ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని పతకం సాధించింది. అనంతరం జరిగిన జాతీయ జట్టు ఎంపిక పోటీల్లోనూ రాణించి, అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించింది. మార్చి 16 నుంచి 22వ తేదీ వరకు నోయిడాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో భావన చోటు దక్కించుకుంది. క్రీడాకారిణి భావనను సిద్ధార్థ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, కన్వీనర్ శ్రీలలిత్‌ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మాధవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.హేమ కాలేజీ ప్రాంగణంలో అభినందించారు.

మిలినోత్సవ్ 4.0 లో సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆచంట సునీత తదితరులు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ స్థాయి మిలినోత్సవ్ 4.0 క్రీడా పోటీల్లో విజయవాడ కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. గుంటూరులోని చలపతి ఫార్మసీ కాలేజీ ఇటీవల నిర్వహించిన ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మిలినోత్సవ్ వాలీబాల్ పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ పురుషుల జట్టు విన్నర్ ట్రోఫీని, మహిళల జట్టు కబడ్డీ, చెస్, త్రోబాల్ క్రీడాంశాల్లో విన్నర్ ట్రోఫీని, షాట్‌పుట్‌లో రన్నర్ ట్రోఫీని అందుకున్నాయి. ఓవరాల్ రన్నర్ చాంపియన్‌షిప్‌ను కాలేజీ జట్టు కైవసం చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను కాలేజీ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత, అధ్యాపకులు సోమవారం అభినందించారు.